క్లుప్తంగా

ధరల పట్టిక లేకుంటే చర్యలు తప్పవు



అంబాజీపేటలో కూరగాయల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

అంబాజీపేట: మండలంలోని అన్ని కూరగాయలు, కిరాణా, సూపర్ మార్కెట్‌ల వద్ద వినియోగదారులకు అర్థమయ్యే రీతిలో ధరల పట్టిక వివరాలను ఉంచాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఎమ్మెర్వో ఎస్.సత్యనారాయణ, డీటీ సీహెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేటలో ఉన్న కిరాణా, కాయకూరలు, సూపర్ మార్కెట్‌లను ఎమ్మెర్వో, డీటీలతో పాటు ఆర్ఐ కె.ఏడుకొండలు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షాపు నిర్వాహకులకు ధరలపై సూచనలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు జి.రమణ, జి.వెంకటేశ్వరరావు, ఐ.వి.వి.రమేష్, డీలర్ డి.ఏడుకొండలు, వీఆర్ఏ దివ్వి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



అంబాజీపేటలో తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్సై చిరంజీవి

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి అండర్ 14, 17, 19 తైక్వాండో పోటీల్లో అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్స్‌ను గెలుచుకున్నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తైక్వాండో కోచ్ పితా ని త్రిమూర్తులు తెలిపారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో క్రీడాకారులను ఎస్సై కె.చిరంజీవి గురువారం అభినందించారు. ఈ నెల 4, 5 తేదీల్లో రైల్వే కోడూరులో జరిగిన అండర్–19 స్కూల్ గేమ్స్ లో ఎబీ.చైతన్య సిల్వర్ మెడల్ సాధించాడు. 6, 7, 8 తేదీల్లో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన అండర్–14, 17 విభాగాల్లో ఎం.మౌనిక సిల్వర్ మెడల్‌ను, బీహెచ్ రితిక్ బ్రౌన్ మెడల్ సాధించారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఎస్సై చిరంజీవితో పాటు ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, వైస్ చైర్మన్ బండారు అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి పథకం చెరువు పరిశీలన



రామేశ్వరంలో కొత్త పైపులైను గురించి ఎమ్మెల్యేకు వివరిస్తున్న స్థానికులు

సఖినేటిపల్లి: రామేశ్వరం సమగ్ర రక్షిత తాగునీటి పథకం చెరువును గురువారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరిశీలించారు. చెరువు నుంచి ఆయా ఏరియాలకు తాగునీటి సరఫరా కోసం ఉన్న పాత పైపులైను స్థానే మరింత కెపాసిటీ ఉన్న కొత్త పైపులైను ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఈ పనులు వల్ల శివారు ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వారు వివరించారు. దీంతో అధికారులతో చర్చించి సత్వర చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జీ పెదకాపు, గుబ్బల ఫణి, ముప్పర్తి నాని, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ భవనం ప్రారంభం



గ్రామ సచివాలయ భవనం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. రూ.43.6 లక్షల వ్యయంతో నిర్మించిన పి.గన్నవరం–2 గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు.

సర్పంచ్ బొండాడ నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, శేరు శ్రీనుబాబు, కర్రి బాబూరావు, కొండా చిన్ని, పంచాయతీ కార్యదర్శులు ఎస్‌వీవీ సత్యనారాయణ, కుంపట్ల పోలరాజు పాల్గొన్నారు.

దోమకాటు.. పశువులకు చేటు

- పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం
- వర్షాకాలంలో దోమల కట్టడికి చర్యలు తీసుకోవాలని పశు వైద్యుల సూచన



అంబాజీపేటలో గేదెకు వైద్యం చేస్తున్న వైద్యాధికారి (ఫైల్)

అంబాజీపేట: ఈ వర్షాకాలంలో మనుషులే కాదు పశువులు కూడా దోమకాటు గురవుతున్నాయి. దోమకాటు వల్ల పశువులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. దీనిని ముందుగా అరికడితే మూగజీవాలను ఆరోగ్యవంతంగా చూసుకోవచ్చు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో పల్లపు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటు వల్ల పశువులు రోగాల బారిన పడడమే కాకుండా పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతోందని పశువైద్యులు చెబుతున్నారు. దోమ నుంచి పశువులను కాపాడుకోవాలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు.

ఇదీ విషయం..

పి.గన్నవరం నియోజకవర్గంలో ఆవులు 9500, గేదెలు 12,500, రాజోలులో 6,100, గేదెలు 9,450, కొత్తపేటలో ఆవులు 7,500, గేదెలు 10,200 పశువులు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే పాడి పశువులకు గొంతు వ్యాపు, దొమ్ము వ్యాధి, గాలికుంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. పశువుల్లో వ్యాధి లక్షణాలను గుర్తిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.

దోమకాటుతో సమస్యలు..

- పశువులను దోమలు ఎక్కువగా కుట్టడంతో మేత సరిగా తీసుకోకపోవడంతో పాటు ఆకలి మందగించడం వల్ల పాల దిగుబడి తగ్గిపోతుంది.
- పశువు శరీర ఉష్ణోగ్రత పెరిగిపోవడంతో రోజు రోజుకు బలహీనపడుతుంది.
- దోమలు కుట్టిన చోట చర్మం దురద వచ్చి పుండ్లు పడతాయి. పశువులకు మేత వేసే ప్రాంతం అంతా శుభ్రంగా లేకుంటే దోమలు చేరి పశువులు మేత తినే సమయంలో వాటిని బాధిస్తాయి. దీంతో మేత కూడా సరిగ్గా తీసుకోదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పశువులను ఉండే పాకలో దోమలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. షెడ్లలో కట్టేసిన తరువాత దోమ తెరలకు రంధ్రాలు లేకుండా చూడాలి. సాయంత్రం పాడి పశువులను పాకలో కట్టేముందు వేప ఆకులు లేదా సాంబ్రాణితో పొగ పెట్టాలి. పశువుల కొట్టం చుట్టూ గుబురు పొదలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పశువులు కట్టేసిన ప్రాంగణాన్ని రోజు శుభ్రం చేసుకోవడంతో పాటు చుట్టు పక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవడం వల్ల దోమల బెడద నుంచి రక్షించుకోవచ్చు.

పశువు ప్రాణానికే ప్రమాదం



ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం వల్ల దోమలు పెరిగి వ్యాధులు వ్యాపిస్తాయి. దోమల వల్ల పశువులకు జ్వరం, అలర్జీ అధికంగా వస్తాయి. దీని వల్ల పాల దిగుబడిపై చూపడమే కాకుండా పశుప్రాణాలను హరిస్తాయి. దోమల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డి.రాజేంద్రప్రసాద్, పశువైద్యాధికారి, అంబాజీపేట

అపరిశుభ్రతతో సమస్య



ప్రస్తుతం కాలంలో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. పశువుల పాకల వద్ద అపరిశుభ్రంగా ఉండడం వల్ల దోమలు పశువులను చుట్టుముడుతాయి. అంతా శుభ్రంగా ఉంచుకోవాలి. వైద్య సలహాలు తీసుకుని పాటించడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. పాడిపశువులపై రక్షణ చర్యలు తీసుకోవాలి. చిన్నసన్నకారు రైతులకు ఉచితంగా దోమల తెరలు ఇవ్వాలి.

– గోసంగి భాస్కరరావు, పాడి రైతు, మాచవరం

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

సాక్షి, అమలాపురం: నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను సజావుగా నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 16వ తేదీ నుంచి నవంబర్ 24 వరకూ 40 రోజుల కాల వ్యవధిలో నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు పూర్తి చేయాలని నిర్ణయించిందన్నారు. జిల్లాకు సంబంధించి గోదావరి మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీలో 9 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 56 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని తెలిపారు. గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీలో 8 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా, 5 మాత్రమే కోనసీమ జిల్లా పరిధిలోకి వస్తాయన్నారు. దీని పరిధిలో 32 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని, వీటన్నింటికీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. 16న నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలవుతుందని, 26న టెరిటోరియల్ కౌన్సిల్ (టీసీ)ల వివరాలను ఇరిగేషన్ అధికారులు ప్రచురించాలన్నారు. 29న తుది టీసీల వివరాలను ప్రచురించాలన్నారు. వచ్చే నెల 5వ తేదీన టీసీలలో ఓటర్ల జాబితాను రెవెన్యూ అధికారులు తయారు చేయాలన్నారు.

అరుదైన వ్యక్తి రతన్ టాటా



మలికిపురంలో టాటా చిత్ర పటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్



అంబాజీపేటలో రతన్‌టాటా చిత్రం పటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

మలికిపురం: దేశంలో కొందరి మరణం కొన్ని లక్షల కుటుంబాలను ప్రభావితం చేస్తుందని అటువంటి వ్యక్తులలో రతన్ టాటా ఒకరని రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ పేర్కొన్నారు. టాటా మృతిపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మలికిపురంలో టాటా చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ముప్పర్తి నాని, అడబాల జానకీ రామ్, గంటా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రతన్‌టాటా సేవలు స్ఫూర్తిదాయకం

అంబాజీపేట: ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన మానవతా మూర్తి రతన్‌టాటా సేవలు ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.సరోవర్ అధ్యక్షతన రతన్ టాటా చిత్రపటం వద్ద గురువారం నివాళులు అర్పించారు. ఎంపీపీ, ఎంపీడీఓలు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బేతాళ ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

అంబాజీపేట: విజయదశమిని పురస్కరించుకుని ఈనెల16వ తేదీన అంబాజీపేటలో నిర్వహించే విజయ బేతాళ స్వామి ఉత్సావాన్ని యువకులు, పెద్దలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా అందరూ సహకరించాలని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు సూచించారు. అంబాజీపేట పెద్దవీధిలో ఉన్న ఏవీఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో 13 పాలాల వాహన నిర్వాహకులతో పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనాల నిర్వాహకులు తమ వాహనాలను సక్రమంగా తీసుకురావాలని, వాహనాల వివరాలు ఇవ్వాలన్నారు. ప్రతి వాహనం నుంచి నలుగురు కమిటీ సభ్యుల పేర్లను ఇవ్వాలన్నారు. వాహనాల వద్ద ఉండే వలంటీర్లకు ప్రత్యేక డ్రెస్ కోడ్ ఉండాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు, రికార్డింగ్ డ్యాన్స్‌లకు నిర్వహించవద్దన్నారు. మోటారు సైకిళ్లకు సైలన్సర్లు తీసి వాహనాలు నడిపితే మోటారు సైకిళ్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బందికి ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. ప్రతి వాహన వద్ద, సినీ ఆర్కెస్ట్రాల వద్ద పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఏటా నిర్వహిస్తున్న వాహనాల ఊరేగింపు ఆనవాయితీ ప్రకారం నిర్వహించుకుని ప్రశాంతంగా తీసుకెళ్లేందుకు వాహనాల నిర్వాహకులు, ప్రజలు సహకరించాలన్నారు. ఎస్సై కె.చిరంజీవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి రామారావు, మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం మోహనరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, దొమ్మేటి సత్యమోహన్, గుత్తుల పండు, మట్టపర్తి సోమేశ్వరరావు, 13 పాలల సంఘ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐరన్ సిరప్ అందజేత



జొన్నాడలో విద్యార్థులకు ఐరన్ సిరప్ డ్రాప్స్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: మండలం పరిధిలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనిమియా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్‌ను అందజేశారు. ఎనిమియా నివారణకు ప్రతి గురువారం ఈ డ్రాప్స్ అందిచనున్నట్టు వైద్యాధికారులు పేర్కొన్నారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివ ప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.

చింతలమోరిలో మన గ్రామం-మన బాధ్యత



చింతలమోరిలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న సర్పంచ్, డాక్టర్ రమేష్‌బాబు

మలికిపురం: చింతలమోరి గ్రామం పల్లవపాలెంలో గ్రామ సర్పంచ్ డా.రాపాక రమేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం మన గ్రామం-మన బాధ్యత అనే కార్యక్రమం జరిగింది. గ్రామంలోని పల్లవపాలెంలో కొన్ని చోట్ల రోడ్లకు ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చి మొక్కలను, కరెంటు లైన్లకు అడ్డుగా ఉన్న కొమ్మలను, చెత్తను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొల్లు ప్రకాష్, గ్రూప్ ప్రెసిడెంట్ కొప్పాడి ఏసుబాబు చింతలమోరి జనసేన పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఓగురి మనోహర్, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చెవ్వకుల వెంకటరత్నం కూటమి నాయకులు, ఇతర పార్టీల నాయకులు, రాపాక శేఖర్, మైనం తాతయ్య, కొల్లు అంజిబాబు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం



దాత శివరామ్మూర్తికి స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ వాస్తవ్యులు ధూళిపాల శివరామమ్మూర్తి కుటుంబ సభ్యులు గురువారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది అభినందించారు.

మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడిగా వెంకటేష్

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో అమలాపురం మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ నూతన కార్యవర్గం గురువారం సాయంత్రం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి మున్సిపల్ మేనేజర్ ఎంవీఎస్ఎన్ మూర్తి అధ్యక్షత వహించారు.

విజయములివ్వమ్మా.. దుర్గమ్మా..



దుర్గాదేవిగా అలంకరణలో శ్రీదేవి అమ్మవారు



అంబాజీపేటలో రాజరాజేశ్వరీదేవిగా వాసవీ అమ్మవారు



మామిడికుదురు మండలం మగటపల్లిలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అంబాజీపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న కనకదుర్గమ్మ ఆలయాల వద్ద గురువారం వేకువ జాము నుండి మహిళలు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దవీధిలో ఉన్న భేతాళ స్వామి ఆలయంలోను విజయ భేతాళుడికి, కె.పెదపూడి, కనకదుర్గ అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరం, గంగలకుర్రు పెదగరువు, గంగలకుర్రు అగ్రహారం, అంబాజీపేటలో వేడుకలు జరిగాయి

అత్రేయపురం: దేవీనవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉచ్చిలి గ్రామంలోని విజయ దుర్గాదేవి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. అత్రేయపురంలో బాలా త్రిపుర సుందరీ రాజరాజేశ్వరీ, కనకమహాలక్ష్మి, ధ్యాన మందిరం వద్ద కనక దుర్గాదేవి, లొల్లలాకుల సమీపంలో విజయదుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంతవాడ పార్వతీదేవి ఆలయం, వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్ర పాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పేరవరం, వెలిచేరు, అంకంపాలెం, పులిదిండి తదితర గ్రామాల్లో శరన్నవరాత్రులు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

దుర్గాదేవిగా అమ్మవార్ల దర్శనం

అమలాపురం టౌన్: పట్టణంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో ఎనిమిదో రోజు గురువారం అమ్మవార్లు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో పూజలు, హోమాలు జరిగాయి. శ్రీదేవి అమ్మవారు, వాసవీకన్యకా పరమేశ్వరీదేవి, వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల వైష్ణవీ కనకదుర్గ, గోల్డ్ మార్కెట్ వద్ద ఉన్న కామాక్షీ ఏకాంబరేశ్వరీదేవి, సావరం బైపాస్ రోడ్డు, కూరగాలయ మార్కెట్, హౌసింగ్ బోర్డు కాలనీ, గోఖిలే సెంటరు, కొంకాపల్లి, నారాయణపేట, కల్వకొలను వీధి, సూర్యనగర్, సూర్యనారాయణపేట, గాంధీనగర్ గల కనకదుర్గ ఆలయాల్లో అమ్మవార్లు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



తాటికాయలవారిపాలెంలో దుర్గాదేవి అవతారంలో కనకదుర్గమ్మ

కొండలమ్మ వారికి కుంకుమ పూజలు

అయినవిల్లి: సిరిపల్లి గ్రామంలో కొలువైన కొండలమ్మ వారికి గురువారం ప్రత్యేక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ అర్చకులు సత్తిబాబు ఆధ్వర్యంలో సాముహిక కుంకుమ పూజలు చేశారు అయినవిల్లి అన్నపూర్ణదేవి అమ్మవారికి, విలస గ్రామంలో కనకదుర్గ అమ్మవారికి, నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామివారి ఆలంయలో సర్వమంగళ పార్వతీ అమ్మవారికి, ముక్తేశ్వరంలోని ముక్తికాంత అమ్మవారికి, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి, లక్ష్మీదేవి అమ్మవారికి విశేష పూజలు జరిపారు.



ఉచ్చిలిలో దుర్గాదేవి అలంకరణలో విజయ కనక దుర్గాదేవి అమ్మవారు

వైభవంగా దుర్గాష్టమి పూజలు

మామిడికుదురు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం దుర్గాష్టమి సందర్భంగా కనకదుర్గ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మగటపల్లి గాయత్రి త్రిశక్తి పీఠంలో వేదనభట్ల రామశర్మ ఆశీస్సులతో బ్రహ్మశ్రీ చెరుకుమిల్లి లక్ష్మణశాస్త్రి, గోవిందవర్జుల రామశర్మ ఆధ్వర్యంలో చండీ సహస్ర కుంకుమార్చనలు, చండీ పారాయణ, పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. 500 మంది ముత్తైయిదువులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ ఆలయంలో కనకదుర్గమ్మ మహాగౌరి అలంకారంలో భక్తులకు కనువిందుగా దర్శనమిచ్చారు. మామిడికుదురు, అప్పనపల్లి, లూటుకుర్రు, బి.దొడ్డవరం, నగరం, పాశర్లపూడిలంక, ఆదుర్రు, పెదపట్నం, కొమరాడ, ఈదరాడ, మాకనపాలెం, గోగన్నమఠం, కరవాక, గెద్దాడ, మొగలికుదురు గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు.

దుర్గాదేవి అవతారంలో కనకదుర్గమ్మ

పి.గన్నవరం: తాటికాయలవారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారు దశరా మహోత్సవాల సందర్భంగా గురువారం దుర్గా దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి సాముహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అన్న సమారాధన జరిగింది. గరుడేశ్వరాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి.